


బోసిపోయిన బొమ్మనపల్లి

- పిల్లాపాపలతో తెలంగాణకు 50 కుటుంబాలు
- పాఠశాలలోని ఐదు తరగతులకు ఆరుగురు విద్యార్థులే హాజరు

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పల్లెలు వలస బాటపడుతున్నాయి. వలస నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన ఉపాధి పనులు సమస్యను తీర్చడం లేదు. సకాలంలో వేతనాలు అందవనే ఉద్దేశంతో పల్లెవాసులు పట్నంబాట పట్టారు. మండలంలోని బొమ్మనపల్లి ఎస్సీ కాలనీలో ఇళ్ల వద్ద వృద్ధులను వదిలేసి 50 కుటుంబాలు పిల్లా పాపలతో తెలంగాణకు వెళ్లిపోయాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతులకుగాను ఆరుగురు విద్యార్థులే ఉన్నారు. ఊళ్లో వెయ్యి మంది దాకా జనాభా ఉన్నారు. ప్రభుత్వం ఆ గ్రామంలో 150 జాబ్ కార్డులను కూడా మంజూరు చేసింది. ఎస్సీ కాలనీలో అందరూ తెలంగాణకు, అందునా హైదరాబాదుకు వలస వెళ్లారు. అక్కడ కొంత మంది చెత్తసేకరణ పనులు చేసుకొని జీవిస్తున్నారు. మరికొంత మంది వివిధ వార్డుల్లో పని చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనుల్లో తక్కువ వేతనాలు వస్తున్నాయని, వలస వెళ్లిన చోట రోజుకు రూ.500 నుంచి రూ.700 దాకా కూలి వస్తుందని, అందువల్ల అక్కడకు వలస వెళ్లారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఈ ప్రాంతంలో ఎర్రనేలలో వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే వలసలు వెళ్తుంటారు. గ్రామంలో వృద్ధులు లేని ఇళ్లకు తాళాలు కనిపిస్తున్నాయి. కొన్ని ఇళ్లలో వృద్ధులు మాత్రమే ఇళ్ల వద్ద ఉంటే పెద్దలు పిల్లా పాపలతో మూటాముల్లె సర్దుకుని తెలంగాణకు బయలుదేరి వెళ్లారు. వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే కొన్ని ప్రాంతాల్లో వలస వెళ్లడం ఆనవాయితీ. అయితే.. బొమ్మనపల్లి గ్రామంలో ప్రతి ఏడాది వలసలు వెళ్తుంటారని గ్రామస్థులు తెలిపారు. కొత్త ఇళ్లను నిర్మించుకున్నప్పటికీ గ్రామంలో ఎవరూ ఉండడం లేదు. కేవలం పండుగలకు, ఇతర కార్యాలకు మాత్రమే వస్తున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు గతంలో 170 మంది నుంచి 80 మంది హాజరయ్యేవారు. ఈ ఏడాది 5వ తరగతిలో ముగ్గురు, నాలుగో తరగతిలో ఒకరు, 2వ తరగతిలో ఇద్దరు కలిపి మొత్తం ఆరుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. అందరినీ ఒకే క్లాసులో కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


కుటుంబ సభ్యులు మొత్తం వలస వెళ్లడంతో ఖాళీగా ఉన్న ఇళ్లు


పాఠశాలలో మిగిలిన విద్యార్థులు వీరే...

ఇంటికి కాపలా ఉన్నా : నాగమ్మ



నా కొడుకులు పిల్లాపాపలతో హైదరాబాదుకు పనులకు వెళ్లారు. నేను ఇంటికి కాపలా ఉన్నా. ఏదైనా జరిగితే దేవునిపైనే భారం. ఇక్కడ పనులు తక్కువగా ఉండటం వల్లే వలస వెళ్లారు. ఎప్పుడో పండుగలకు వాళ్లు వస్తారు.

మళ్లీ పండుగకు వస్తారు : ఓబన్న



మా కుటుంబమంతా హైదరాబాదులో ఉంది. అక్కడ చెత్త సేకరణ పనులు చేస్తున్నారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు పిల్లా పాపలతో పనులు చేయడానికి వెళ్లిపోయాడు. పండుగకు, ఏదైనా కార్యానికి వస్తారు.

ముగ్గురు కొడుకులూ హైదరాబాదులోనే : ఇమామమ్మ



నాకు ముగ్గురు కుమారులు. వారంతా కుటుంబాలతో హైదరాబాదులో ఉంటున్నారు. నేనొక్కదాన్నే ఇంటి వద్ద ఉంటున్నాను. ఇక్కడ ఉపాధి పనులకు వెళితే వేతనాలు ఎప్పుడు ఇచ్చేది తెలియదు.

అందరికీ ఉపాధి కల్పిస్తున్నాం : నర్సిరెడ్డి, ఏపీవో



బొమ్మనపల్లి పంచాయతీ పరిధిలో మొత్తం 160 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పిస్తున్నాం. అదనపు ఆదాయం కోసం వలస వెళ్తున్నారు. సకాలంలో ఉపాధి కూలీ డబ్బులు అందేలా చర్యలు తీసుకున్నాం.

అటవీ భూముల్లో
ఇసుక దొంగలు

- 39 ఎకరాల్లో ఇసుక మేటలు.. ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

కర్నూలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గతంలో వాగులు, వంకలలో ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేసేవారు. తాజాగా ఇసుక మాఫియా పచ్చని అడవి భూములపై కన్నేసింది. రాత్రి వేళల్లో అటవీ భూముల్లోకి ట్రాక్టర్లతో ప్రవేశించి ఇసుకను తరలించుకపోయి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఫారెస్ట్ అధికారుల అండతోనే ఈ భాగోతం జరుగుతున్నదని, మామూళ్లు అందుతుండడంతో కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు నగర శివారులో హంద్రీ నది ఒడ్డునే ఉన్న 'విజయ వనం' అటవీ భూముల్లో ఇసుకాసురులు పెట్రేగిపోతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు అటవీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కర్నూలు నగర శివారున హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారిని ఆనుకొని దిన్నెదేవరపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో 'విజయ వనం' ఉంది. 97 ఎకరాలు అటవీ శాఖ భూములు ఉన్నాయి. హంద్రీ నది ఒడ్డు నుంచి సుమారు 38 ఎకరాల్లో ఇసుక మేటలు ఉన్నాయి. అక్రమార్కులకు ఇసుక కాసుల వర్షం కురిపిస్తున్నది. రాజకీయ అండతో కొందరు అక్రమార్కులు అటవీ భూముల్లో వాలిపోతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకొని పదుల ట్రాక్టర్లలో అక్రమ రవాణా చేస్తున్నారు. రోజుకు దాదాపుగా 35-40 ట్రాక్టర్లు ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారని తెలుస్తున్నది. ఒకనాడు బీచ్‌గా అందంగా కనిపించిన ఈ అటవీ భూముల్లో ఇసుక తవ్వకాలతో భారీగా గుంతలు పడ్డాయి. అటవీ శాఖ చట్టాలు బలంగా ఉన్నా.. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులు అడ్డుకట్ట వేయలేపోవడం వెనుక అంతర్యామేమిటి? అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి.


విజయవనం అటవీ భూమి నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలింపు

జింకల పార్కుగా ప్రసిద్ధి

వెంకన్నబావి వద్ద ఉండే విజయం వనానికి ఒకనాడు జింకల పార్కుగా పేరు ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారులు పట్టించుకోకపోవడం, నగరం విస్తరించడం వల్ల ఇసుక అక్రమ తవ్వకాలు ఇక్కడ పెరిగాయి. హంద్రీ నది ఆనుకొని ఇసుక మేటలు ఉన్న అటవీ భూములను బీచ్ తరహాలో అభివృద్ధి చేసి, హంద్రీ నదికి చెక్‌డ్యాం నిర్మిస్తే, జింకల పార్కు ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకావం ఉంది. ఇసుక అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేసి అక్రమ రవాణాదారులతో పాటు తెర వెనుక పాత్ర పోషిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఇసుక తవ్వకాల వల్ల విజయవనం అటవీ భూముల్లో ఏర్పడిన గోతులు

దర్జాగా ఇసుక రవాణా

జిల్లా కేంద్రంలో అటవి శాఖ చీఫ్ కన్‌జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్), జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ), ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఓ), డిఫ్యూటీ రేంజ్ ఆఫీసర్.. ఇలా వివిధ హోదాల్లో అధికారులు పని చేస్తున్నారు. అటవీ భూముల సంరక్షణ, అక్రమ తవ్వకాలు, చెట్లు నరికేయడం, ఆక్రమణలు వంటివి అరికట్టేందుకు ఫారెస్ట్ విజిలెన్స్ స్క్వాడ్ ప్రత్యేక టీం కూడా ఉంది. ఇంత పకడ్బందీ వ్యవస్థ ఉన్నా కూడా జిల్లా కేంద్రం పక్కనే అటవీ భూముల్లో అక్రమార్కులు చొరబడి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తుండడంపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులకు ఈ శాఖలోని ఒకరిద్దరు అధికారులు తెరవెనుక సహకరి స్తున్నందు వల్లే ఈ అవినీతి సాగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. పైఅధికారులు ఎవరైనా వస్తున్నారంటే విజయం వనంలో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బంది తక్షణమే ఇసుక ట్రాక్టర్ల యజమానులకు సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అటవీ భూమి సంరక్షణకు చర్యలు

విజయవనం అటవీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌ఓ) శ్యామల వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించింది. అయితే ఆమె అందుబాటులోకి రాలేదు. ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయకుమార్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆరు నెలల క్రితమే ఇక్కడికి బదిలీపై వచ్చానని, అటవీ భూముల్లో ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తా అన్నారు.

అమ్మవారికి
అక్షర పూజ

కొలనుభారతి క్షేత్రంలో ఘనంగా వసంత పంచమి

ఆత్మకూరు/కొత్తపల్లి, ఫిబ్రవరి 2: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రాతఃకాల సమయంలోనే అమ్మవారికి చారుఘోషినీ జలాలచే అభిషేకం చేశారు. అనంతరం ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పంచసూక్తాభిషేకాలను శాస్త్రోకంగా చేపట్టారు. తదుపరి సహస్రనామ కుంకుమార్చనలు, పుష్పార్చనలు, మహామంత్రపుష్పం, మహా నైవేద్యం, మహామంగళహారతులు వంటి తదితర పూజా కైంకర్యాలను జరిపారు. ఆలయ ముఖ మండపంలో పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ సామూహిక అక్షరాభ్యాసాలు, బీజాక్షర క్రతువులను నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర పరిధిలోని సప్త శివాలయాల్లో కొలువుదీరిన శివలింగాలకు కూడా చారుఘోషినీ జలాలు, బిల్వపత్రాలు, పంచామృతాలతో అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఈ వేడుకను పురస్కరించుకుని అమ్మవారి గావించిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.


అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూ

శ్రీశైల దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు

కొలనుభారతి క్షేత్ర ఆనవాయితీ ప్రకారం వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని శ్రీశైల దేవవస్థానం తరుపున సరస్వతీ అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకురాగా వాటిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, శ్రీశైలం దేవస్థానం సూపరిండెంట్ నాగేశ్వరరావు, కొలనుభారతి పాలక మండలి చైర్మన్ వెంకటనాయుడులు, ఈవో రామలింగారెడ్డి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకల్లో కాకనూరు శారద పీఠం పీఠాధిపతి యోగేంద్ర సరస్వతీ స్వామిజీ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వసంత పంచమి వేడుకల్లో భాగంగా సరస్వతి అమ్మవారిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తన కుమారుడు వీరనాగిరెడ్డికి అక్షరాభ్యాసం చేయించారు.


ప్రత్యేక అలంకరణలో సరస్వతి అమ్మవారు

ఐదేళ్లలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాలు

జగన్ హయాంలో రాష్ట్రం విధ్వంసం: మంత్రి భరత్

వివరాలు 7లో

6న కర్నూలుకు హైకోర్టు కమిటీ

న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు కమిటీ ఈ నెల 6వ తేదీన కర్నూలుకు వస్తున్నట్లు న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అవసరమైన స్థలంతో పాటు జడ్జిల నివాస స్థలాల పరిశీలనకు ఈ కమిటీ వస్తున్నట్లు మంత్రి తెలిపారు. కమిటీలో జడ్జిలు కూడా ఉండవచ్చున్నారు. న్యాయరాజ ధాని పేరుతో ప్రజలను మభ్య పెట్టిన వైసీపీ ప్రభుత్వం తాత్సార వైఖరి వల్లే హైకోర్టు బెంచ్ ఆలస్యమైందని ఆరోపించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతోందని తెలిపారు. దిన్నెదేవరపాడు ఈఆర్‌సీ భవన సముదాయంతో పాటు అధికారులు ఎంపిక చేసిన ప్రత్యామ్నాయ స్థలాలను బెంచ్ పరిశీలిస్తుందని, కమిటీ నిర్ణయం మేరకు హైకోర్టు బెంచ్ స్థలం నిర్ధారణ జరుగుతుందని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

స్మార్ట్ మీటర్ మాయాజాలం!

పిండి మిషన్ కరెంట్ బిల్లు రూ.13,832 ● పాత మీటరు ఉన్నప్పుడు రూ.4,500

కోసిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిల్లుల మోతతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. కోసిగి మండల పరిధిలోని డి. బెళగల్ గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అనే వ్యక్తి పిండి మిషన్ నిర్వహిస్తున్నాడు. అయితే.. గత నెల డిసెంబరులో స్మార్ట్ మీటరు ఏర్పాటు చేశాక జనవరి నెలలో రూ.11,993 బిల్లు వచ్చిందని, గతంలో రూ.3వేల నుంచి రూ.4వేలు మాత్రమే వచ్చేదని ఆయన అన్నారు. ఈ సంగతి విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని అన్నారు. పైగా ఫిబ్రవరి నెలలో కరెంటు బిల్లు తక్కువ వస్తుందని చెప్పి జనవరి కట్టించుకున్నారని, అయితే ఫిబ్రవరి నెలలో కరెంటు బిల్లు రూ.13,832 బిల్లు వచ్చిందని వాపోయారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ వీరేష్‌ను వివరణ కోరగా.. డి. బెళగల్ గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అధికంగా లోడు ఉపయోగించి మిషన్ పని చేస్తున్నారని, త్రీఫేస్ విద్యుత్ కావడంతో మోటారుకు ఆన్ ఆఫ్ స్విచ్ బటన్ ఏర్పాటు చేయకపోవడంతో బిల్లు అధికంగా వచ్చిందని అన్నారు. కర్నూలు నుంచి ప్రత్యేక టీమును పంపి స్మార్ట్‌మీటరును పరిశీలించామని, ఎక్కడా పొరపాటు లేదని తెలిపారు.


రూ.13,832 వచ్చిన కరెంటు బిల్లు


కరెంట్ బిల్లు చూపుతున్న బాధితుడు

ఐదేళ్లలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాలు

- చంద్రబాబు ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచారు
- దావోస్‌లో ఆయన కష్టం స్పష్టంగా కనిపించింది
- ఉదయం 6 నుంచి రాత్రి 11 వరకు సమావేశాలే
- జగన్ హయాంలో రాష్ట్రం విధ్వంసం: మంత్రి భరత్



కర్నూలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "వైసీపీ హయాంలో ఐదేళ్ల రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. వామ్మో.. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులా? అంటూ పారిపోయే పరిస్థితికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో పెట్టుబడిదారులకు మళ్లీ భరోసా కలిగింది. వివిధ సంస్థలు వస్తున్నాయి' అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాల కల్పన తథ్యమని చెప్పారు. "ఏడు నెలల్లో రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వాటి ద్వారా 4.10 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడితో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్(సీబీజీ) యూనిట్ల ఏర్పాటుకు రియల్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా 2.55 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు రానున్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయయి. ఒకనాటి రాళ్లసీమ నేడు గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారబోతుంది" అని మంత్రి వివరించారు. ఐదేళ్లలో రాయలసీమ జిల్లాలకు మరిన్ని కంపెనీలు వస్తాయన్నారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది

వైసీపీ హయాంలో జగన్ సాగించిన అరాచకం, విధ్వంసం వల్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని మంత్రి భరత్ చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడడంతో వారిలో మళ్లీ భరోసా కలిగిందన్నారు. ఏపీ బ్రాండ్ ఇమేజీ పెరిగిందని, దావోస్ పర్యటనలో అది స్పష్టంగా కనపించిందని తెలిపారు. దావోస్‌లో ఎముకలు కొరికే చలి ఉన్నా.. సీఎం చంద్రబాబు సాధారణ దుస్తుల్లోనే గడపడం ఆయనకే సాధ్యమైందన్నారు. "అక్కడున్న ఐదు రోజులు ప్రతిక్షణం ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సీఎం చంద్రబాబు కష్టపడ్డారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కంపెనీల ప్రతినిధులతో వందకు పైగా రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చలు, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను వివరించారు" అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు హైదరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశారని, అక్కడ ఏర్పాటు చేసిన హైటెక్ సిటీ తరహాలో ప్రస్తుతం విశాఖలోని మధురవాడ వద్ద డేటా సిటీ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటికే గూగుల్‌తో ఒప్పందం కూడా చేసుకున్నామన్నారు. విశాఖ ఐటీ సిటీగా భారతపటంలో ప్రముఖ స్థానంలో నిలవబోతుందన్నారు. అమ్మకు, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి(జగన్) ఐదు కోట్ల ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ఘాటుగా స్పందించారు. "వైసీపీ నాయకులు నిరసనల పేరిట ప్రజల్లోకి వస్తున్నామని అంటున్నారు. ఏ మోహం పెట్టుకొని వస్తారు" అని మంత్రి భరత్ ప్రశ్నించారు.

వచ్చే ప్రాజెక్టులు ఇవీ..

- కర్నూలులో ఏపీ జెన్కో, ఎన్‌హెచ్‌టీసీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి.
- అనంతపురం, కడపల్లో ఎస్‌ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ-1 రూ.1,728 కోట్లతో ప్రాజెక్టు పెట్టనుంది.
- అనంతపురం జిల్లాలో టాటా పవర్ రూ.2 వేల కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేయనుంది.
- కడప, నంద్యాల జిల్లాల్లో ఎస్‌ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ-2 రూ.1,728 కోట్లతో ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది.
- ఎకోరెడ్ ఎనర్జీ ఇండియా కర్నూలు జిల్లాలో రూ.4,435 కోట్లతో, కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.3,142 కోట్లు, అనంతపురం, కడప జిల్లాల్లో రెండు యూనిట్లలో రూ.794 కోట్లు, కడప, నంద్యాల జిల్లాల్లో 'క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ' హైబ్రిడ్-3 రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో టాటా పవర్ ఎనర్జీ కర్నూలు జిల్లాలో రూ.2 వేల కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేయనుంది.
- గ్రీన్‌కో రూ.16,500 కోట్లతో మూడు ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది.

నేడు ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్యావరణం విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలోని 162 కళాశాలల నుంచి 23,262 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షకు హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గతంలో ఈ పరీక్ష రాయని ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఉంటే వారు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ

- కర్నూలు డీసీసీ అధ్యక్షుడు మురళీ కృష్ణ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పీ. మురళీకృష్ణ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-26 పెట్టుబడిదారులను అందలం ఎక్కించేలా ఉందన్నారు. ఇది రైతు వ్యతిరేక బడ్జెట్ అని, మద్దతు ధరలు రుణమాఫీ ప్రస్తావన లేదని, పంట బీమాకు నిధులు కేటాయింపు లేకపోవడం రైతులను నిరాశ పరిచిందని అన్నారు. దళితులు, మైనార్టీలు, బీసీలకు విద్య, ఆరోగ్యంపై ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. అన్ని రంగాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిం చిన, ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపులేక పోవడం దారుణమన్నారు.

గోశాల అభివృద్ధికి కృషి

- దాతల సత్కార సభలో మంత్రి టీజీ భరత్



గోవుకు ఆహారం తినిపిస్తున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గోశాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగర శివారు జీన్ రోడ్డులోని గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రి గోశాలలో ఆవుల సంఖ్య ఎవెయ్యి దాటిన సందర్భంగా గోశాల దాతలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. గోమాతలకు ఆహారం తినిపించి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గోవులకు సేవ చేస్తే శుభం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ గోసేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. గోవులకు సంతృప్తిగా గ్రాసం అందించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అవసరమైతే గోశాలలో గుడి కట్టించేందుకు ఆలోచించాలని ఇదివరకే నిర్వాహకులకు చెప్పినట్లు గుర్తు చేశారు. గోశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గోశాల అభివృద్ధికి సహకరించిన దాతలను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, గోశాల అధ్యక్షుడు జగదీష్‌గుప్త, ఇల్లూరు లక్ష్మయ్య, విజయకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

- డివైడర్ పైకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు, ప్రయాణికులు క్షేమం



డివైడర్ పైకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు



మృతి చెందిన డ్రైవర్ ఉసేన్ సాబ్

ఆలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో స్టీరింగ్‌పైనే స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బస్సులో ఉన్న ప్రయాణికులు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. కేఏ384759 నెంబరు గల మీనాక్షి ట్రావెల్స్ బస్సు ఆదివారం ఆదోని నుంచి బళ్లారికి వెళ్తోంది. ఆలూరు పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ ఉషేన్‌సాబ్ (64)కు గుండెపోటు వచ్చింది. దీంతో బస్సు స్టీరింగ్ అదుపు తప్పడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొంది. పెద్ద శబ్దం రావడం అందులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు ఆగిపోగానే బయటకు పరుగులు తీశారు. డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. డ్రైవర్ కర్ణాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాద ఘటనను ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు. ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రెండో రోజు కుంభాభిషేకం

ఘనంగా కొనసాగుతున్న ఉరుకుంద ఈరన్న స్వామి వేడుకలు



నందికోల ఉత్సవం



ఆకట్టుకున్న మహిళల కోలాటాలు



కలశాల ఉత్సవం

కౌతాళం ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో కుంబాభిషేక వేడుకలు రెండో రోజు ఆదివారం వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా హోమాలు, కలశాల అభిషేకాలు చేపట్టారు. ముందుగా యాగశాలలో సుదర్శన, మృత్యుంజయ, చండీ యాగాలు నిర్వహించారు. వాస్తు, బలిదాన పూజ, సూర్య నమస్కార సూర్యోదయాన నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులు, కలశాలతో ధాన్య, జలాధివాస క్రతువులు చేశారు. యాగశాలలో రుద్వేగ, యజుర్వేద, అధర్వణ వేద పఠనంతో శాస్త్రోక్తంగా దేవతా మూర్తులు, కలశాలకు పంచామృతాభిషేకం, మంగళ హారతులు చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా దేవాలయం నుంచి ఉరుకుంద గ్రామం వరకు మహిళలు కలశాలు చేతపట్టి కోలాటలతో ఉత్సవాలు ప్రారంభించారు. వీరభద్ర స్వామి వేషధారణలో చేపట్టిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నంది కోలసేవలు, కేరళ మంగళవాయిద్యాలు భక్తులకు కనువిందు చేశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, కర్నూలు డీసీ గురుప్రసాద్, ఏసీలు పాండురంగారెడ్డి, గంజి మల్లికార్జున ప్రసాద్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు




బాలికల విభాగంలో విజేతలు ఏపీ, నాగాలాండ్ జట్లు

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్న జాతీయ జూనియర్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జాతీయ చాంపియన్‌షిప్ డబుల్స్ విభాగం బాలుర విభాగంలో హర్యానా, తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో హర్యానా జట్టు తెలంగాణ జట్టుపై 15-13, 15-12 స్కోర్ తేడాతో ఘన విజయం సాధించింది. బాలికల డబుల్స్ విభాగంలో నాగలాండ్, ఆంధ్రప్రదేశ్ జట్లు పోటీ పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు నాగాలాండ్ పై 15-9, 15-5 స్కోరు తేడాతో విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. క్వాడ్ విభాగం బాలుర పోటీలో బీహార్ జట్టు మణిపూర్ జట్టు పై 15-9, 15-13 స్కోరు తేడాతో విజయం సాధించింది. బాలికల పోటీలో మణిపూర్ జట్టు హర్యానాజట్టుపై 15-9, 17-15 స్కోరు తేడాతో విజయం సాధించింది. విజేతలకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, రామకృష్ణా విద్యా సంస్థల చైర్మన్ జి.రామకృష్ణా రెడ్డి, డా. జి. రవికృష్ణ, డా.మధుసూదన్‌రావు, ఏపీ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవర్ ఆర్టిస్ట్ బుక్‌లో కోటేష్ చిత్రాలు

- అంతర్జాతీయ చిత్ర కళామిత్ర అవార్డు







నంద్యాల కల్చరల్, పిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్‌కు అవర్ ఆర్టిస్ట్ బుక్‌లో రెండు పేజీలు కేటాయించి, ఆయన వేసిన ఆరు చిత్రాలను ప్రచురించారు. చిత్రకళలో ఆయన చేస్తున్న సేవలకు "చిత్రకళా మిత్ర" అవార్డును ప్రదానం చేశారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలోని కోనసీమ చిత్రకళ పరిషత్ వారు 35వ చిత్రకళ బ్రహ్మోత్సవ వేడుకలు జనవరి 19న అమలాపురంలోని సత్యసాయి కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన, "అవర్ ఆర్టిస్ట్" అనే బుక్‌ను ఆవిష్కరించారు. ప్రసిద్ధ చిత్రకారుడు, పరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామ స్వామి 215 మంది కళాకారులను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కోటేశ్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ పుస్తకం ద్వారా ప్రసిద్ధ చిత్రకారులు బాపు, వడ్డాది పాపయ్య, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో ప్రముఖ చిత్రకారులను తెలియపరిచారు. కోటేష్ వేసిన గణేశుడు, రాధాకృష్ణ, బుద్ధుడు, పూసలమ్మే అమ్మాయి చిత్రాలు ఈ పుస్తకంలో చోటు సంపాదించుకున్నాయి.

ఉపాధిలో అక్రమాలకు చెక్

ఉమ్మడి జిల్లాలో 20వేల శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు కసరత్తు



ఉపాధి పనులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు, వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పించి వలసలను నివారించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం క్రమేణా అక్రమార్కులకు జేబులు నింపే పథకంగా మారింది.

దొంగ మస్టర్లతో స్వాహా..

నేతలు, వారి అనుచరులు దొంగమస్టర్లను రికార్డుల్లో నమోదు చేయించి పెద్ద ఎత్తున కూలీల సొమ్మును స్వాహా చేస్తున్నట్లు ఫిర్యాదులు వెలువెత్తుతు న్నాయి. పాత పనులకే మెరుగులు దిద్ది పెద్ద ఎత్తున నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆ పథకం అమలుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం అక్రమాల నివారణ కోసం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టింది.

ఉపాధి హామీ పథకాన్ని గాడిన పెట్టేందుకు కర్నూలు జిల్లాలో 10వేల శ్రమశక్తి సంఘాలు, నంద్యాల జిల్లాలో మరో 10వేల శ్రమశక్తి సంఘాలు, మొత్తం 20వేల శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేయబోతున్నట్లు నీటి యాజమన్య సంస్థ పీడీ వెంకటనారాయణ ఇటీవల తెలిపారు. ఒక్కో సంఘంలో 20 నుంచి 50 మంది సభ్యులు ఉంటారనీ, వీరు ప్రతిరోజు ఎంత మంది కూలీలు హాజరవుతారో పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తమకు నివేదికలు అందజేస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.600కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.

ఉపయోగం లేదని రైతుల ఆందోళన

కర్నూలు జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలను వలస వెళ్లకుండా నిరోధించడంలో ఉపాధి హామీ పథకం పెద్దగా ఉపయోగపడడం లేదని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రమశక్తి సంఘాల ద్వారా ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగం అడ్డుకట్ట వేసి రైతులకు, వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున ఆదుకున్నారు. వైసీపీ ప్రభుత్వం శ్రమశక్తి సంఘాలను రద్దు చేయడంతో పథకం పక్కదారి పట్టింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని దారిలో పెట్టేందుకు శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఆర్‌యూ ఇంజనీరింగ్ కళాశాల పనులు ప్రారంభించాలి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగర శివారులోని నిలిచి పోయిన పనులను ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, పీఎస్ఎన్ కన్వీనరు అమర్ బాబు బృందం పరిశీలించింది. వారు మాట్లాడుతూ జగన్నాథగట్టు సమీపంలోని రాయలసీమ యూనివర్సిటీ స్థలాన్ని అసంపూర్తి నిలిచి పోయిన వాటిని వెంటనే కొనసాగించేందుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు ప్రత్యేకంగా క్యాంపస్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్నాథగట్టుపై రాయలసీమ యూనివర్సిటీకి కేటాయించిన భూమి అక్రమణలకు గురికాకుండా కాపాడుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, హర్ష, శంకర్, జితేంద్ర, తరుణ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలి



ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు చేసి పార్లమెంటులో ఈ బిల్లుకు కూటమి ప్రభుత్వం, జేడీయూ మద్దతు ఇవ్వరాదని ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆదివారం పాతబస్తీ గడియారం ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, ముస్లిం మైనార్టీలపైన అనేక రకాలుగా దాడులు చేసిందన్నారు. ప్రార్థనా స్థలాలను కూల్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ఎండీ.షరీఫ్, ఉపాధ్యక్షుడు నాసిర్ అహ్మద్, తెలుగు పండిట్ నిసార్ అహ్మద్, మహబూబ్‌భాష, ఎస్.అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాలల యుద్ధ గర్జనను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో 23న జరిగే మాలల యుద్ధ గర్జనను జయప్రదం చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు పిలుపునిచ్చారు. ఆదివారం పాతబస్టాండు సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణములో గర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఓబులేసు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా క్రిమిలేయర్ రద్దు చేయాలన్నారు. ఎస్సీ కులగణన చేసి 23 శాతం రిజర్వేషన్ పెంచాలన్నారు. సమావేశంలో గౌరవ సలహాదారుడు గోన నాగరాజు, దామోదరం రాధాకృష్ణ, కే.మాధవస్వామి, ఎలీషా, కే.రంగస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారులు నిర్మించాలి

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ప్రధాన రహదారిని సీసీ నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం గ్రామంలో పర్యటించి పలు ఇబ్బందులు పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ కెనరాబ్యాంకు లైన్ రోడ్డు, పలుచోట్ల డ్రైనేజీలు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రమద్దిలేటి, గఫూర్‌మియా, వీరన్న, మల్లిఖార్జున పాల్గొన్నారు.

క్రీడల్లో సాధన చేయాలి

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే క్రీడల్లో సాధన చేయాలని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యూనివర్సల్ దుబోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు పోటీలను ప్రారంభించారు. డా.శంకర్‌శర్మ మాట్లాడుతూ కరాటే బెల్టు గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పలు రకాల బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాదిగల గుండెచప్పుడు వినిపిస్తాం

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో 7న నిర్వహించే లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమం ద్వారా మాదిగల గుండెచప్పుడు వినిపిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు ఆంద్రయ్య అన్నారు. మండలంలోని అనుగొండ, గోరంట్ల గ్రామాల్లో ఆదివారం గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్, రాజు, అక్కన్న, అయ్యన్న పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఉత్సవ మూర్తులకు మహా హారతి ఇస్తున్న ఆలయ అర్చకుడు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర నదీ తీరంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్, సీవీ దుర్గాప్రసాద్, కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి రోడ్డు ఉల్చాలరోడ్డులోని వాసవీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులతోపాటూ చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



శనిగ

●రైతన్నను నట్టేట ముంచిన శనగ పంట● అనుకూలించని ప్రకృతి ● తగ్గిన దిగుబడి● ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): శనగ పంట రైతన్నలను నట్టేట ముంచింది. ప్రకృతి అనుకూలించకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. శనగ పంట దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, హుశేనాపురం తదితర గ్రామాల్లో 5వేల ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. అయితే సాగు చేసినప్పటి నుంచి నెల రోజులు అకాల వర్షాలు పడటంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. గత ఏడాది ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది 4 నుంచి 5 క్వింటాళ్ల మాత్రమే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు లబోదిబో మంటున్నారు. వర్షాలు, మంచు అధికం కావడంతో శనగ పంటకు పురుగు ఉధృతి అధికమైంది. వీటిని నివారించేందుకు రైతులు ఖరీదైన మందులు పిచికారీ చేశారు. గత ఏడాది శనగ పంట క్వింటం రూ.4,500 ధర ఉండేదని, అయితే.. ఈ ఏడాది క్వింటం రూ.6వేలు కల్పిస్తే గిట్టుబాటు కలుగుతుందని రైతులు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. శనగ పంట కల్లాల్లో, ఇళ్లల్లో మగ్గుతున్నాయి. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన శనగలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

● రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయండి



ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా శనగ పంటను కొనుగోలు చేయాలి. క్వింటం రూ.6వేలకు కొనుగోలు చేస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. తక్షణమే ప్రభుత్వం శనగలను కొనుగోలు చేసి ఆదుకోవాలి.

-పుల్లారెడ్డి, రైతు, పూడిచర్ల

గిట్టుబాటు ధర కల్పించాలి



శనగ పంట రైతులను ఈ ఏడాది నష్టాల్లో ముంచింది. పంట దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గింది. పంటపై చేసిన అప్పులు తీరవు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఆదాంబాషా, రైతు, ఓర్వకల్లు

రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది అకాల వర్షాల వల్ల శనగ పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. గత ఏడాది ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం నాలుగైదు క్వింటాళ్లు కూడా రావడం లేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గోప కృష్ణారెడ్డి, రైతు, హుశేనాపురం:

తాగునీటి సమస్య పరిష్కారం

సి. బెళగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పడమర బీసీ కాలనీలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బొగ్గుల దసగిరికి, టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పరిష్కరించారు. గత ఎన్నికల ముందు కాలనీలో తాగునీటి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తాగు నీటి సమస్య పరిష్కారం కోసం నిధులు విడుదల చేసినట్లు ఎంపీటీసీ ఈరన్నగౌడు, టీడీపీ నాయకులు అనమంతుగౌడు, వేణు, మల్లికార్జు గౌడు, కృష్ణగౌడు తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి కాలనీలో తాగునీటి సమస్య వేధించేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సంసిద్ పాఠశాల్లో చెస్ పోటీలు



విజేతలైన చదరంగం క్రీడాకారులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్‌నగర్‌లోని సంసిద్ పాఠశాల్లో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. స్పార్క్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ వారి ఆధ్వర్యంలో స్పార్క్ చెస్ అకాడమీ, సంసిద్ పాఠశాల సంయుక్తగా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి చదరంగం క్రీడాకారులు పాల్గొన్నట్లు పాఠశాల గౌరవ ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సుజాత తెలిపారు. విజేతలకు ప్రముఖ వ్యాపారవేత్త శేషఫణి, డాక్టర్ చైతన్యలు బహుమతులు అందజేశారు.

రేపు వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీ ఆవిష్కరణ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం వాల్మీకి బోయ సేవా సంస్థ 2025 నూతన డైరీని ప్రభుత్వ మెడికల్ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ డా.భవాని ప్రసాద్ ఆవిష్కరించనున్నారని వాల్మీకి బోయ సేవా సంస్థ వ్యవస్థాపకులు కుబేర స్వామి, జిల్లా అధ్యక్షులు పెద్దయ్య, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కోశాధికారి ఈరన్న తెలిపారు. కార్యక్రమానికి హోంగార్డు ఎస్పీ మహేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు, డా.రామచంద్ర నాయుడు, డా.వెంకటేశ్వర్లు, డా.జయరాంహాజరు కానున్నారని తెలిపారు.

ఫార్మా మేనేజర్ల సంఘానికి కార్యవర్గం ఎన్నిక

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మా సేల్స్ మేనేజర్ల సంఘం కార్యవర్గాన్ని నగరంలోని ఫన్ అండ్ ఫుడ్ హోటల్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంటు రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరి యాదవ్, కే.రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా సూరా సత్యనారాయణయ్య, ఉపాధ్యక్షులుగా తులసిరెడ్డి, కార్యదర్శిగా రామాంజుల రెడ్డి, సహాయ కార్యదర్శి ఉపేంద్ర యాదవ్, కోశాధికారిగా శ్రీరాంపుల్లయ్య, సహాయ కోశాధికారిగా విక్రమ్ ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

వివిధ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



విజ్ఞానపీఠం పాఠశాల్లో సామూహిక అక్షరాభ్యాసంలో బాలలు, వారి తల్లిదండ్రులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని ఆదివారం నగరంలోని హైందవ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వివిధ పాఠశాలల్లో, ఆలయాల్లో సరస్వతి దేవి అమ్మవారికి విశేష పూజాదికాలు నిర్వహించారు. నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞానపీఠం పాఠశాల్లో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో నెలవైన సరస్వతి మాతకు పూజలు చేశారు. సరస్వతి దేవి ఆవాహన పూజ, హోమము చేపట్టారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 50 ఏళ్లుగా పేద వర్గాలకు, పరిసర గ్రామాల విద్యార్థులకు విజ్ఞాన పీఠం పాఠశాల సేవలు అందిస్తోందని పాఠశాల కరస్పాండెంట్ వీపీ గురుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, అధ్యాపకులు శ్రీనివాసులు, రామగోవిందప్ప, చంద్రమోహన్, రణధీర్‌రెడ్డి, రేణుక, స్వర్ణలత, మాణిక్యరెడ్డి, వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● **ఆదిత్య పాఠశాల్లో...**కల్లూరులోని ఆదిత్య పాఠశాల్లో వసంత పంచమి సందర్భంగా సరస్వతి దేవి అమ్మవారి పూజను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి. వాసుదేవయ్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో కల్లూరులోని స్థానిక భక్తులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. పూజల అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

సేవా భారతి ఆధ్వర్యంలో ఎక్స్‌రే, రక్త పరీక్షలు ప్రారంభం



మాట్లాడుతున్న సేవాభారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగం శ్రీనివాసులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్‌డీసీడీ, సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యసేవా కేంద్రంలో ఎక్స్‌రే, రక్త పరీక్షల సేవలను సేవా భారతి జిల్లా అధ్యక్షుడు, అశ్విని హాస్పిటల్ అధినేత డా.శ్రీనివాసరెడ్డి, వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డా.సి. వాసురెడ్డి ప్రముఖ న్యూరోసర్జన్ డా.అనంత్ ప్రారంభించారు. సేవాభారతి జిల్లా అధ్యక్షుడు డా. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హెచ్‌డీసీటీ సేవా భారతి ఆధ్వర్యంలో 3 సంవత్సరాలుగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ నగర సంఘ్ బాలక్ డా.సి. వాసురెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సేవాభారతి రాష్ట్ర వర్గ సభ్యులు లింగం శ్రీనివాసులు, సీనియర్ న్యూరోసర్జన్ డా.డబ్ల్యూ సీతారాం, డా. సుదర్శన్ రెడ్డి, డా. సుబ్బారెడ్డి, డా.ఇందిర, హెచ్‌డీసటీ నిర్వాహకులు దిలీప్, అమిత్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వల్లే కళాకారులకు గౌరవం : ఎమ్మెల్యే



కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కళాకారుడు కావడం వల్లే రాష్ట్రంలోని కళాకారులందరికీ సముచిత గౌరవం లభిస్తోందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కూచిపూడి గజ్జ మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కళాకారుల క్షేమం, సంక్షేమానికి కృషిచేస్తానని చెప్పారు. అదేవిధంగా కళావేదిక ఏర్పాటు చేయడానికి ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ విద్యతోపాటు సాంస్కృతిక రంగంలో ప్రవేశం ఉంటే విద్యార్థులకు మంచి భవిష్యత్తుతోపాటు కళారంగంలో ఖ్యాతి గడించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ శారద సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు నాగసాయి ప్రదీప్, కిరణ్, అధ్యాపకురాలు పార్వతి, వైద్యురాలు డాక్టర్ అమృతసాయి తదితరులు పాల్గొన్నారు. కళాకారులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన

సేవాలాల్ జయంతిని అధికారింగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కైలాస్‌నాయక్

కర్నూలు రూరల్ ఫిబ్రవరి2(ఆంధ్ర జ్యోతి): బంజార జాతుల ఆరాధ్యదైవం గురువు, సంఘసంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కైలాస్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక బిర్లాకౌంపౌండులోని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యలయంలో ఆదివారం లంబాడీ కుల సంఘాలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దాదాపు 15కోట్ల పైబడి జనాభా కలిగిన బంజారా కులాల వారికి తగిన విద్యవైద్యరాజకీయాల్లోను సముచిత స్థానం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 13,14,15 తేదీలలో సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నాయక్ మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రంలో దాదాపు 40 నియోజకవర్గాల్లో లంబాడీ కులాల వారు అధికంగా ఉన్నారని అలాంటి ప్రాంతంలో ప్రభుత్వం తప్పనిసరిగా గిరిజన నిధులతో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో గోర్ సంస్కృతి నిర్వహణ కమిటీ సభ్యులు రంగస్వామినాయక్, కృష్ణరాథోడ్, సేనావత్ రామునాయక్, రామాంజనేయుల నాయక్, చంద్రనాయక్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థకు ఊడిగం చేస్తున్న బీజేపీ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దేశంలోని కార్పొరేట్ సంస్థకు ఊడిగం చేసేందుకే బడ్జెట్‌లో వెసులుబాటు కల్పించారని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామాంజనేయులు ఆదివారం తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో సంపాదన సృష్టించే వారిని, అమూల్యమైన సేవలందించే వారిని విస్మరించి బడా కార్పొరేట్ వ్యాపార సంస్థకు ఊడిగం చేసే విధంగా ఉందని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం విశ్వకర్మ యోజన పథకం కింద 18రకాల చేతి వృత్తిదారులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని గొప్పలు చెప్పిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున కోత విధించి సామాన్యులను విస్మరించిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీపీఎం అధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం సుందరయ్య కూడలి, వీకర్ సెక్షన్ కాలనీ, పూలబజార్ పొట్టిశ్రీరాములు విగ్రహల వద్ద నిరసన చేశారు. నగర కార్యదర్శివర్గసభ్యుడు కే.సుధాకరప్ప మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను పక్కనబెట్టి ఏపీకి అన్యాయం చేశారని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్ఈఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాక్ మెట్రో, ఎయిమ్స్, రాజధాని నిర్మాణం తదితర వాటికి నిధుల ఊసేలేదన్నారు. ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదేపదే ప్రస్తావించారు తప్ప కొత్తగా కేటాయించలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గత ఏడాది రూ.5.512కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.5,936 కేటాయించినట్లు తెలిపారు. పునరావాసం, పరిహారం ప్యాకేజీని పట్టించుకోలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.నరసింహులు, సీహెచ్.సాయిబాబ, శ్యామలమ్మ, రహిమాన్,ఎస్ఎండీ.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

● ప్రైవేటు కంపెనీ బీమా రంగంలో 100 శాతం ఎఫ్డీఏ నష్టదాయకమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సునీయకుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్‌ను అఖిల భారత బీమా ఉద్యోగు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఓర్వకల్లు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసి అన్యాయం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని నన్నూరు బంగ్లా ఏరియాలో సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో నిరసనను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రజల ఆశలను అడియాశలు చేసిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, విభజన హామీలను పక్కన పెట్టిందని ఆరోపించారు. విభజన ప్రకారం జాతీయ విద్యాసంస్థలకు కేటాయింపులు జరగలేదని, విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ యూనివర్సిటీ, కడప స్టీల్ ప్లాంటు, వైజాగ్ మెట్రో, జిల్లాలకు నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసేలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసూంబాషా, వెంకటేశ్వర్లు, అన్నయ్య, రామస్వామి, షరీఫ్, శాలిమియా తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



నన్నూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కాంప్లెక్స్‌కు వైసీపీ గ్రహణం


ఆగిపోయిన మెగా కాంప్లెక్స్ ఇదే..

- మున్సిపాలిటీ తీర్మానం చేయకుండా అడ్డుకుంటున్న వైసీపీ కౌన్సిలర్లు
- మెగా కాంప్లెక్స్ ఎప్పుడు పూర్తవుతుందోనని లీజుదారుల బెంబేలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అదిగో ఇదిగో అంటూ ఊరించిన మెగా కాంప్లెక్స్ నిర్మాణం అటకెక్కింది. గుడివిల్ పద్ధతిలో ఈ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 24 మంది లీజుదారులు 7.74 కోట్లు చెల్లించారు. దక్కించుకున్నవారు మున్సిపాలిటీకి తిరిగి అద్దె చెల్లించాలి. నిర్మాణ పనులను 2024 జనవరిలో నాటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. 25 శాతం నిర్మాణం పనులు పూర్తికాని అభివృద్ధి పనులను నిలిపివేయాలన్న కూటమి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పనులు ఆగిపోయాయి.

మున్సిపాలిటీ తీర్మానం చేస్తే అనుమతి

ఆగిపోయిన మెగా కాంప్లెక్స్ పనులకు అనుమతి ఇవ్వాలని ఆదోని పురపాలక సంఘం తీర్మానం చేసి పంపితే ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశముంది. అయితే తీర్మానం చేసేందుకు వైసీపీ కౌన్సిలర్లు సహకరించడం లేదని ఆరోపణలు ఉన్నారు.

శుక్రవారం సమావేశంలోనూ ఇంతే..

శుక్రవారం చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షన సమావేశం నిర్వహించారు. మెగా కమర్షియల్ కాంప్లెక్స్ పనులు తిరిగి ప్రారంభించేందుకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి కోరుతూ తీర్మానాన్ని అజెండాలో చేర్చారు. అయితే వైసీపీ సభ్యులు సభావేశానికి అడ్డు తగలడంతో తీర్మానం ఆమోదం పొందలేదు.

బెంబేలెత్తిపోతున్న లీజుదారులు

వేలం పాటలో రూ.లక్షలు మున్సిపాలిటీకి చెల్లించి రెండేళ్లవతున్నా పనులు ముందుకు సాగక పోవడంతో లీజుదారులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పటికి పూర్తవుతుందో, తాము వ్యాపారం ఎప్పుడు చేసుకోవాలో అని ఎదురు చూస్తూ బెంబేలెత్తుతున్నారు. అప్పులు చేసి అడ్వాన్సులను చెల్లించామని న్యాయం జరిగేలా చూడాలని వ్యాపారులు దాసరి శంకర్ రావు, ఇసాక్ పటేల్, మనియర్ సికిందర్, సురేష్ వాపోతున్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో చెల్లించిన అడ్వాన్సులను వడ్డీతో కలిపి తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి

- ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి చూపిందని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జాతీయ కార్యదర్శి రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టినా అందులో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా కోట్లలో ఉన్న ఎస్సీలకు రూ.1,500, ఎస్టీలకు 15,000 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. పది శాతం కూడా నిధులు ఇవ్వకపోవడం చూస్తుంటే ఎస్సీ, ఎస్టీలపై వారి బాధ్యత ఏపాటిదో అర్థమవుతుందన్నారు. సబ్ ప్లాన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. ఎస్టీ ఎస్టీలకు చెరో రూ.13లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. త్వరలోనే డిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి విన్నవిస్తామన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. రెండో విడత రీసర్వేకు మండలంలోని పగిడిరాయి గ్రామం ఎంపికైందన్నారు. ఇప్పటికే రీసర్వే ప్రారంభించామని, రైతులకు ముందుగా సమాచారం ఇస్తామని, రైతుల తేదీ ప్రకారమే సర్వే చేస్తామని అన్నారు.

యురేనియంతో కాలుష్యం


మాట్లాడుతున్న మానవహక్కుల సంఘం నాయకులు

దేవనకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలతో వాతావరణం కలుషితమయ్యే ప్రమాదముందని మానవహ క్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామస్తులతో సమావేశమ య్యారు. నీరు, గాలి కలుషితమై, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆనారోగ్యాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేవేంద్రబాబు, కారప్ప, నబి రసూల్, మనోహర్, రషీద్ పటేల్, సూర్యనారాయణ, గ్రామస్తులు రవిశర్మ, చింపి ఈరన్న ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను ప్రారంభిస్తున్న డీఈ

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య కాంట్రాక్టర్లకు సూచించారు. ఆదివారం స్థానిక సాయినగర్ కాలనీలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. అవినీతికి పాల్పడితే బిల్లులు నిలిపివే స్తామని హెచ్చరిం చారు. రూ.కోటితో పనులకు ప్రతిపాద నలు పంపించామన్నారు. టీడీపీ కార్యదర్శి గూడూరు ధదనుంజ యుడు, నాయకులు రంగయ్య, గడ్డం మల్లికార్జున ఉన్నారు.

బడ్జెట్‌లో మొండిచేయి



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆలూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు మొండిచేయి చూపారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి ఆరోపించారు. ఆదివారం ఆలూరు అంబేడ్కర్ సర్కిల్లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కేంద్ర ప్రభుత్వం రాయలసీమను పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. షాకీర్, క్రిష్ణ, విఠల్, ఆటో యూనియన్ నాయకులు సద్దాం, ఈరన్న, ఐద్వా నాయకులు రత్నమ్మ, రాధమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రానికి స్థల పరిశీలన

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. దాత ప్రశాంత్ కుమార్, డా.వినోద్ కుమార్ తొగర్చేడు రహదారిలో గల 20సెంట్ల స్థలాన్ని పరిశీలించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న దాత

పైపు లీకేజీతో తాగునీటి వృథా

దేవనకొండ,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బండగట్టు నుంచి డోన్‌కు నీటి సరఫరా చేసే క్రిష్ణగిరి మంచినీటి పథకం పైపులైను ఈదులదేవరబండ గ్రామం వద్ద లీకేజీ కావడతో తాగునీరు వృథా అవుతోంది. వాటర్ ఫౌంటెయిన్‌లా దాదాపు ఇరవై అడుగుల మేర నీరు చిమ్ముతోంది. ఎక్స్‌వేటర్‌తో పనులు చేస్తుండగా పైపు పగిలినట్లు సమాచారం. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


వృథా అవుతున్న తాగునీరు

ఐదు దశాబ్దాల స్నేహం

- 1971-73 ఇంటర్మీడియట్ విద్యార్థుల కలయిక


1971-73 ఇంటర్ విద్యార్థులు

పత్తికొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్ (1971-73) విద్యార్థులు ఆదివారం కలిశారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత మలేరియా అధికారి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. 1971లో ఏర్పాటైన ఈ కళాశాలలో చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన వారు 52ఏళ్ల తర్వాత కళాశాలలో తిరిగి కలుసుకున్నారు. అలనాటి స్నేహితులను చూసి మైమరచి పోయారు. కళాశాల ప్రాంగణమంతా కలియతిరిగారు. తాము చదువుకున్న రోజుల్లోని సంగతులను గుర్తు చేసుకొని ఆనందించారు.

పాఠశాలల నిర్వీర్యం తగదు



మాట్లాడుతున్న సుంకన్న

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరుతో పాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న అన్నారు. ఆదివారం కార్యాలయంలో నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జీవో నెం.117ను రద్దు చేస్తామని చెప్పి, పాఠశాలలను విలీనం చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ అసిస్టెంట్లను 3,4,5 తరగతులు ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను చెల్లింపులో రూ. 12.75 లక్షలు ఇస్తూ పాత పద్ధతిలోనే రూ.4 లక్షల నుంచి స్లాబులు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మహదేవప్ప, గోపాల్, రామాంజినేయులు, సుధాకర్‌బాబు, వి.రామాంజినేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

హంద్రీ నీవా నీటిని మళ్లించండి

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ తాలుకాలోని గ్రామాలకు హంద్రీనీవా కాలువల ద్వారా నీటిని మళ్లించాలని పెరవలి గ్రామానికి చెందిన పారా విశ్వనాథ్ కోరారు. ఆదివారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉరవకొండలో కలిశారు. పత్తికొండను మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, ఎమ్మెల్యే శ్యాంబాబు అభివృద్ధి చేస్తున్నారని, మీ సహకారాలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారా జయవర్ధన్, నరేంద్ర, ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న పారా విశ్వనాథ్

పీఈటీలపై పోలీసు టీం విజయం

పత్తికొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న సౌత్ లెవెల్ టీ20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం పత్తికొండ పోలీస్-పీఈటీ టీంలు తలపడ్డాయి. పీఈటీ టీం నిర్దష్ట 16 ఓవర్లలో 128 పరుగులు చేయగా, పోలీస్ టీం 10 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించి విజయం సాధించింది. కాగా పోలీస్ టీం తరపున ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మూడు ఓవర్లు బౌలింగ్ చేశారు.

- టీ20 క్రికెట్ నిర్వహణకు స్టేడియానికి మరమ్మతులు చేసిన శ్రీనివాసుల గౌడ్‌ను ఆయన అభినందించారు.


శ్రీనివాసుల గౌడ్‌తో ఎమ్మెల్యే




మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఆంజనేయులు సేవలు మరువలేనివి

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడిన గుమ్మల ఆంజనేయుల సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర నాయ కుడు పి. రామచంద్రయ్య అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో 33వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి నివాళి అర్పించారు. ఆంజనేయులు బసినేపల్లి, హంపా తదితర గ్రామాల్లో పేదల కోసం పోరాటాలు చేశారన్నారు. సీపీఐ బలోపేతానికి తన సర్వస్వం పోగొట్టుకున్నారన్నారు. ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపో తున్నారని, మద్దతు ధర ప్రకటించినా కందులను ఇంతవరకు కొనగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనగ రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాగరాజు, కోదండరాముడు, సుధాకర్ ఉన్నారు

ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ వేడుకలు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఆ సంఘ నాయకులు నిర్వహించారు. ఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి రాజశేఖర్ రావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో 6శాతం విద్యకు కేటాయించడం శుభ పరిణామన్నారు. కార్యవర్గ సభ్యుడు తాయప్ప, దేవేంద్రనాథ్, భైరప్ప, రామకృష్ణ రావు ఉన్నారు.

సమాచారం

రేపు వేలం పాటలు

పత్తికొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికొండ ఆలయంలో తలనీలాలు, కొబ్బరి కాయల వేలం 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈవో వీరన్న తెలిపారు. జనవరి 27న నిర్వహించాల్సిన వేలాల వాయిదాపడడంతో మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు. తలనీలాలకు రూ.లక్ష, టెంకాలయకు రూ.25వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

పత్తికొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామంలోని భద్రకాళి, వీరభద్ర స్వామి ఉత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. వారం పాటు జరిగే ఉత్సవాలకు గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు

సోమవారం కలశస్థాపన, 6వతేదీ రాత్రి ఎదుర్కోలు, గణేశారాదన, ఆయకట్టుదారులకు అన్నదానం, భజన, 7న ఉదయం స్వామి కళ్యాణం, సాయంత్రం రథోత్సవం, 8న రాత్రి ప్రభోత్సవం, 9వ తేదీ వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయి.

రేపటి నుంచి ఉరుసు

తుగ్గలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీ నుంచి మస్తానయ్య ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పెద్దలు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

14న రాతిదూలం పోటీలు

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రథోత్సవం సందర్భంగా ఈ నెల 14న గుంతకల్లు రోడ్డు పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న మైదానంలో రాతిదూలం పోటీలు ఉంటాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. వివరాలకు 9849409827, 88776577702 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు మండల సమావేశం

తుగ్గలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీన మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ ఆదివారం తెలిపారు. ఆదివారం ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన సమావేశం ఉంటుందని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు కూడా పాల్గొనాలని, అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు.

మాదిగలు తరలి రావాలి

ఆస్పరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మందకష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే లక్షల డప్పుల కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని ఎమ్ఎస్‌పీ మండల అధ్యక్షుడు రామాంజినేయులు, ఎమ్మార్పీఎస్ ఆస్పరి ఇన్‌చార్జి చిన్న సంజన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఆస్పరిలో కరపత్రాలు విడుదల చేశారు.

ఆటలతో ఉపశమనం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆటలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని మిల్టన్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సీఈవో వెంకటేష్ సుశీలా, లావణ్య, విజయలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో పాల్గొన్న తల్లిదండ్రులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆలూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికేరలో నూతనంగా నిర్మించిన మాళ మల్లేశ్వర ఆలయంలో ఆదివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి, వైకుంఠం మల్లికార్జున చౌదరి, వైసీపీ మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

ఆలూరు: ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని కోరారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఒలింపియాడ్ పోటీల్లో మల్లికార్జున విద్యాలయం విద్యార్థిని దేవిక ప్రతిభ కనబరిచింది. నెట్టేకల్లు గ్రామ టీడీపీ నాయకుడు నాగరాజు కుమార్తె దేవిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నలిచినట్లు హెచ్ఎం నరసింహ తెలిపారు. ఆదివారం అమరావతి పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని శృతి ద్వితీయ స్థానం, అబాకాస్‌లో కృష్ణ, సుశాంత్ మొదటి, రెండో స్థానం సాధించారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

టీడీపీతోనే అభివృద్ధి

తుగ్గలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ యువ నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్, బాలన్న, రవికుమార్ అన్నారు. ఆదివారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈశ్యాం బాబుకు జొన్నగిరిలోని సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. జొన్నగిరి, చిన్న జొన్నగిరి గ్రామాల మధ్య కొట్టుకుపోయిన కల్వర్టును నిర్మించారన్నారు. అలాగే పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు యువతకు పెద్ద పీట వేశారన్నారు. బలరాం, అంజి, జయచంద్ర, రంగస్వామి తదితరులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ

పత్తికొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖకవి సవ్వప్ప గారి ఈరన్న రాసిన 'తెలుగు కల్పవల్లి' శతకం పుస్తకావిష్కరణను ఆదివారం పట్టణంలోని రీడింగ్ రూమ్‌లో నిర్వహించారు. కమలా కళానికేతన్ సాహితీ సంస్థ 39వ వార్షికోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్లేషకులు వెంకటేశ్వర యాదవ్ పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ కవి కొత్తపల్లి సత్యనారాయణ కవి రచనా సామర్థ్యాన్ని కొనియాడారు.

'లక్ష డప్పుల'ను జయప్రదం చేయండి

వెల్దుర్తి/టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 7వ తేదిన తలపెట్టిన 'లక్ష డప్పులు-వేల గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం వెల్దుర్తిలో గోడ పత్రికలను విడుదల చేశారు.

అభివృద్ధి జీర్ణించుకోలేని వైసీపీ

మద్దికెర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, పంచాయతీ సభ్యుడు జంబునాథ్‌రాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విఠోబ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదేళ్లలో ఎప్పుడూ జరగునంత అభివృద్ధి పనులు చేస్తుందన్నారు.

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్న : రైతులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జవాబు: విశ్రాంతి భవనంతో పాటు, రూ.5లకే భోజనం, ఉచిత వైద్యం అందిస్తున్నాము.

ప్రశ్న: వర్షం వస్తే పంట ఉత్పత్తులు తడిచి నీటిలో కొట్టుకుపోయి రైతులు నష్టపోతున్నారు కదా?

జవాబు: పంట ఉత్పత్తులు తడవకుండా టార్పిలిన్లు ఉన్నాయి. డ్రైనేజీ ఘట్టర్ల నిర్మాణానికి రూ.1.20కోట్లతో పనులు చేస్తున్నాం.

ప్రశ్న: వేరుశనగ కంది, పత్తి, దిగుబడులకు మద్దతు ధర కంటే తక్కువ ధర ఉందా?

జవాబు: పత్తిని సీసీఐ ద్వారా, కందిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నాం. వేరుశనగను త్వరలోనే మద్దతు ధరతో ఆయిల్ ఫెడ్ ద్వారా కొనగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 2024-25 సంవత్సరానికి వసూళ్ల లక్ష్యం ఎంత.?

జవాబు: సెస్సు, చెక్ పోస్టు, గోడౌన్ అద్దె రూపంలో రూ. 17.10 కోట్లను లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రశ్న: జనవరి ఆఖరుకు ఎంత ఆదాయం వచ్చింది?

జవాబు : ఇప్పటివరకూ రూ.14 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. గడువు లోపు లక్ష్యాన్ని అధిగమిస్తాం.





పగలు భగభగ రాత్రి గజగజ

మంత్రాలయం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పగలు భానుడు ఉగ్రరూపం దాల్చితే..రాత్రి చంద్రుడు గజగజ వణికిస్తున్నాడు. దీంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రాలయంలో స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు తుంగభద్రనదిలో స్నానాలు చేయలేక బిందె వేడి నీటికి రూ. 60లకు కొనుగోలు చేసి స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఉదయం 9 గంటలైనా పొగ మంచుతో చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత సాయంత్రం 4 గంటల వరకు ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో మూగ జీవాలు మేత వేసేందుకు వెళ్లి ఎండ వేడిమి తట్టుకోలేక చెట్ల కింద సేద తీరుతూ ఉపశమనం పొందుతున్నాయి. ఒక వైపు చలి, మరో వైపు ఎండ ఉండటంతో భక్తులు సైతం మధ్యాహ్న సమయాల్లో రోడ్లపైకి రావడం లేదు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

పెద్దకడుబూరు , ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తమతో పాటు చదువుకున్న మిత్రులు తమ మధ్య లేకపోవడంతో ఆ స్నేహితుల మదిని కలిచివేసింది. బాధితకుటుంబాలకు తమ వంతుగా అండగా నిలబడ్డారు. పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు తంబళ రంగస్వామి, బోయ శ్రీనివాసులు మరణించారు. బాధిత కుటుంబాలను తోటి స్నేహితులు ఆదివారం పరామర్శించారు. రంగస్వామి, బోయ శ్రీనివాసులు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 16వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు రాజు, వీరేష్, క్రాంతి, కుమార్ గౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీల యూనిట్‌లో పనిచేయుటకు పారాలీగల్ వలంటీర్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమ ఆదివారం పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వాసి అయి ఉండాలన్నారు. సామాజిక సేవ, చట్ట అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో ఉన్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు వంటి వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 5వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు, అధ్యక్షులు, మండల న్యాయ సేవాధికార సంస్థ ఎమ్మిగనూరుకు పంపాలన్నారు.

ఘనంగా మర్రిస్వామికి తులాభారం


స్వామి వారికి తులాభారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు కాశీవిశ్వనాథ్

కౌతాళం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీకృష్ణావధూత ఆశ్రమంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలు ఆదివారం తులాభార కార్యక్రమంతో ముగిశాయి. చివరి రోజు తులాభార కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అర్లబండ మఠం పీఠాధిపతి మర్రిస్వాములకు తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నబసప్ప కుమారుడు అమోగ్, సోదరుడు టీడీపీ కౌతాళం టౌన్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

కొనసాగిన సామూహిక వివాహాలు

కృష్ణావధూత ఆశ్రమంలో ఆరాధనోత్సవాల సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సామూహిక వివాహాలు జరిపించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే దాతల సహకారంతో తొమ్మిది మంది జంటలకు వివాహం జరిపించారు. వైసీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి వివాహ వస్తువులు అందించి జంటలను ఆశీర్వాదించారు. నూతన జంటలను టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, నాయకులు వెంకటపతిరాజు, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని సూచించారు. ఇసుకను ఉచితం మాటున అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత ఇసుక కావాల్సినవారు ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించడంలో హెల్మెట్ లేకున్నా, లైసెన్స్ లేకున్నా సంబంధిత పత్రాలను చూపకపోయినా ఎంవీ కేసులు పెడతామని హెచ్చరించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

మంత్రాలయం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామంలో ఎమ్మిగనూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో జరిగే దేవర ఉత్సవాలకు రంగురాట్నం సామాన్లు వేసుకుని గత నెల 31న దంపతులు రాత్రి వచ్చారు. ఉదయం నీటి కోసం వెళ్లిన మహిళ ఆలస్యం కావడంతో ఎందుకు ఆలస్యమైందని భర్త ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఇంటికి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసిన ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త రజాక్ ఆదివారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రాలయంలో కన్నడ చిత్రం షూటింగ్


చిత్రానికి క్లాప్ కొడుతున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో ఆదివారం రాత్రి కలేకల్లప్ప శృతి సినిమాస్ బ్యానర్‌పై లవ్ సీ కన్నడ చిత్రానికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మంచాల సొసైటీ సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రదీప్ రెడ్డి క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. వసంత కుమార్ దర్శకత్వంలో నిర్మాత, కథ హీరోగా కలప్ప, హీరోయినుగా అనూషలు చిత్రంలో నటిస్తున్నారు. ఈ నెల 4నుంచి మంత్రాలయంలో పూర్తి చేసుకుని రెగ్యులర్ షూటింగ్ వివిధ ప్రదేశాల్లో రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల బీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, కాంత రెడ్డి, భాస్కర్, సినీ నిర్మాత నాగిరెడ్డి, రియల్ యాక్టర్ రంగారెడ్డి, వినోద్, మేఘన, మోహన్ రావు, రోహిణీ, అనూష, గురు, తదితర నటీనటులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి రాముడు

ఎమ్మిగనూరుటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్లో అంకెల గారడీలతో మరోసారి దేశ ప్రజలను కేంద్ర ప్రభుత్వం మోసగించిందని సీపీఎం పట్టణ కార్యదర్శి రాముడు అన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేటర్లకు కట్టబెట్టిందని ఆరోపించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యమంటూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ రంగానికి మేలు చేసేదే తప్ప సామాన్యులకు, రైతులకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు.

దేశ సంపదను కార్పొరేటర్లకు కట్టబెట్టిన కేంద్రం దేశ సంపదను కార్పొరేటర్లకు కేంద్రం కట్టబెట్టిందని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి నాగరాజు, భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి యేసేపు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ, ఉపాధి హామీ పథకాలకు తూట్లు పొడిచిందన్నారు. విభజన హామీలను పక్కనపెట్టి రాష్ట్రానికి మొండి చేయి చూపిందని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్, ఐఐటి, సెంట్రల్ యూనివర్సిటీ, పోర్టులు, స్టీల్ ప్లాంట్లు, రాజధాని నిర్మాణానికి నిధుల ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం బాధాకరమన్నారు. ఆయా సమావేశాల్లో సత్యన్న, బాబు, రమేష్, నర్సన్న, మారెప్ప, అనీఫ్, యు రమేష్, లక్ష్మణ పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయ స్వామి ఆలయ కలశ ప్రతిష్ఠ


మార్కండేయ స్వామిని దర్శించుకుంటున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఐఏఎస్ గురుమూర్తి

కోసిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలీయుల ఆరాధ్యదైవం మార్కండేయ స్వామి దేవాలయం నూతన గోపుర శిఖరం కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీయుల సంక్షేమ సంఘం, యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ పూజారి వీరస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, ఆదోనికి చెందిన వేద పండితులు గరుడాద్రి వెంకటసుబ్బయ్య శాస్త్రి నేతృత్వంలో కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ, అరుణ హోమం, ప్రతిష్ఠ దేవతామూర్తుల మంత్ర హోమం, బలిహరణం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, మహా మంగళహారతులు పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పాలకుర్తి దివాకర్ రెడ్డి, పద్మశాలీ సంక్షేమ సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షులు కొంగతి లక్ష్మీనారాయణ ట్రిపుల్ ఐటీ కళాశాల రిజిస్ట్రార్ ఐఏఎస్ కేతారి గురుమూర్తి హాజరయ్యారు. వీరికి ఆలయ కమిటీ అధ్యక్షులు వై.ఆంజనేయులు ఆధ్వర్యంలో సన్మానించి స్వామివారి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, భరద్వాజ శెట్టి, రవితేజ శెట్టి, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సుజయీంద్రుల బంగారు రథానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి


సుజయీంద్ర ప్రవచనాలు ఇస్తున్న పీఠాధిపతి

వైభవంగా సుజయీంద్ర తీర్థుల ఆరాధన

● బంగారు రథంపై ఊరేగింపు

మంత్రాలయం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నవ నిర్మాణకర్తగా పిలవబడుతున్న పూర్వపు పీఠాధిపతి సుజయీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బంగారు రథంపై సుజయీంద్రుల చిత్రపటాన్ని ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. జయహో సుజయీంద్రులు.. గురుసార్వభౌమా గోవిందా గోవిందా అంటూ జయధ్వానాలు పలుకుతూ రథోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు సుజయీంద్రుల బృందావనానికి సుప్రభాతం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి పీఠాధిపతులు హారతులు ఇచ్చారు. ఊంజల మండపంలో సుజయీంద్రుల జీవిత చరిత్రను భక్తులకు వినిపించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేష వస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్‌గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, సుజీంద్రతీర్థులు, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, విజయేంద్రాచార్, రవికులకర్ణి, అనంతపురాణిక్, జేపీ స్వామి, తంబి స్వామి, సుజీంద్రాచార్, రమణరావు భక్తులు పాల్గొన్నారు.

వెండిరథంపై ప్రహ్లాదరాయలు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం మాఘమాసం తదియను పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి సంస్థానపూజ చేశారు. అనంతరం వెండి రథాన్ని ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

హెచ్.కైరవాడిలో గడ్డివాములు దగ్ధం


మంటలను ఆర్పివేస్తున్న గ్రామస్థులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హెచ్‌కైరవాడి గ్రామంలో ఆదివారం సాయంత్రం నాలుగు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 2లక్షల ఆస్తినష్టం జరిగింది. అందిన సమాచారం మేరకు హెచ్‌కైరవాడి గ్రామ శివార్ల లో చాకలి శ్రీనివాసులు, బీమరాయుడి కి చెందిన నాలుగు గడ్డి వాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. తీవ్రంగా కష్టపడి మంటలను అదుపు చేశారు. పక్కనే ఉన్న మరిన్ని గడ్డి వాములు దగ్ధం కాకుండా కాపాడుకున్నారు. అనంతరం కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది. బాధితులు మాట్లాడుతూ దాదాపు రూ. 2లక్షలు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



ఆదమరిస్తే అంతే..!

● ఐరంగల్-చిన్నభోంపల్లి గ్రామాల మధ్య కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు

కోసిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని ఐరంగల్-చిన్నభోంపల్లి ప్రధాన రోడ్డు కోతకు గురి కావడంతో ప్రమాదపుటంచుల్లో వాహనదారుల ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచిన అంతే సంగతులు. ఆర్అండ్‌బీ రోడ్డు భారీ కోతకు గురి కావడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని, ఐరంగల్, చిన్నభోంపల్లి గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. సుమారు నాలుగు అడుగుల మేర పెద్ద గొయ్యి ఏర్పడిందని, అధికారులు కోతకు గురైన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

టౌన్‌బ్యాంకు నూతన పాలకవర్గం ఏర్పాటు

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని టౌన్‌బ్యాంకు నూతన పాలక వర్గాన్ని(నామినేటెడ్ బాడీ) ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ జనవరి 31న జీవో జారీ చేసింది. ఈ జీవో లో చైర్మన్‌గా ఉరుకుందయ్యశెట్టి, నరసప్ప(వైస్‌చైర్మన్), సభ్యులుగా, మహబూబ్‌బాషా, రవికుమార్, భీమేష్, వాల్మీకి రాజు, వెంకటేశ్వరరెడ్డి, షాలేమ్, నరసింహులు(బీజేపీ), ఎ.నవీన్‌కుమార్(జనసేనా), జి.వెంకటగిరిలను నియమిస్తూ జీవో జారీ అయ్యింది. కొత్తగా ఏర్పాటు కానున్న పాలకవర్గం 7న స్థానిక బ్యాంకు ఆవరణంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా ఉరుకుందయ్యశెట్టి ఆదివారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మిగతా సభ్యులు 7న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకుకు దాదాపు 30ఏళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్నవారిని పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ వస్తుంది. ఇదే క్రమంలో కూటమి ప్రభుత్వం సైతం తమ నామినేటెడ్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. అయితే ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు బ్యాంకుకు ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నాయి.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఆత్మీయ సమ్మేళనంలో వైసీపీ నాయకులు


మాట్లాడుతున్న కౌన్సిలర్, పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైసీపీ నాయకులు అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని 1వ వార్డులో వైఎస్ఆర్‌సీపీ ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ రఘు వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా వైఎస్ఆర్‌సీపీ ఉండి పోరాడుతుందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు నజీర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యు కే రాజశేఖర్, సునీల్, చేనేత శివప్రసాద్, బడేసాబ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియ నిలిపివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రాథమిక పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, తిమ్మన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో 117 సవరణ ప్రక్రియ సంఘాలతో చర్చించిన అంశాలకు భిన్నంగా ఆదర్శ పాఠశాలల పేరుతో చేస్తున్న విలీన ప్రక్రియను నిలిపివేయాలని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన 11వ వేతన సవరణ బకాయిలు, కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, 12వ వేతన సవరణ కమిటీని నియమించాలని కోరారు. సమావేశంలో బసవరాజు, బాబయ్య, ఎల్లప్ప, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): కార్మిక, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని తాలుకా, పట్టణ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నరసింహారెడ్డి, విజయేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి, వైద్య, ఆరోగ్య, విద్య రంగాలకు 2020-26 బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, అసంఘటిత కార్మికులకు కూడా పీఎఫ్, ఈఎస్ఐ చట్టాన్ని అమలు చేస్తూ పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ కార్మికులకు పెన్షన్ డబ్బులు పెంచాలన్నారు. కార్యక్రమంలో వీరేష్, శ, వీరాంజనేయులు, ఖాజ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

● రోడ్లపై నిలిచిన మూగజీవాలు
● చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు, పోలీసులు

మంత్రాలయం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ప్రధాన రహదారిలో మూగజీవాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధాన రహదారిలో మూగ జీవాలు అడ్డంగా నిలుస్తుండటంతో సమస్యగా మారింది. ఆదివారం రాత్రి మూగజీవాలు ప్రధాన రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని అక్కడి నుంచి పంపించేందుకు పంచాయతీ, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో భక్తులు అవస్థ పడుతున్నారు. రైతుల గోవులను ఇంట్లోనే పెట్టుకోకుండా బయటకు వదిలేస్తున్నారనీ తెలిపారు. గతంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య రైతులకు, గోవుల యజమానులకు నోటీసులు పంపినప్పటికీ వాటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువులను తొలగించి ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రధాన రోడ్డుపై అడ్డంగా మూగ జీవాలు